## క్లుప్తంగా

### నేడు పీటీఎంలో రథోత్సవం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మంగళ వాయిద్యాలు, మల్లయ్య దొరల విన్యాసాలు, బళ్లారి డ్రమ్ముల శబ్దాలు, పండరి భజనలు, కోలాటలు, పిల్లన గ్రోవి భజనలు అట్టహాసంగా జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య పరిష్కారం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ అనంతాపురంలోని ప్రభుత్వ బోరులో మోటారు కాలిపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో సదరు ప్రభుత్వ బోరులో కొత్త మోటారు, పైపులు అమర్చడంతో నీటి సమస్య పరిష్కారం అయిందని శనివారం సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ పీఏస్ మధు తెలిపారు.

### నేడు దేవప్పకోటలో ఎమ్మెల్యే పర్యటన

పెద్దతిప్పసముద్రం : మండలంలోని దేవప్పకోట పంచాయతీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆదివారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### పేదలకు నాణ్యమైన వైద్య సేవలు



దేవులపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కలకడ : పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రాలేని వారికి, వృద్ధులకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గొప్పవరం లాంటిదన్నారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి పరిధిలోని దేవులపల్లె గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, అసంక్రమణ వ్యాధులు కలిగిన వారు అనేక మంది ఆసుపత్రికి రాలేరని వారికి ఇంటివద్దనే వైద్యసేవలు అందుతాయని, రక్తపోటు, బీపీ, షుగర్, పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి, వరలక్ష్మి, రోజ, రమేష్‌బాబు, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

### పరస్పర వాగ్వాదం.. ఆపై ఘర్షణ

పెద్దమండ్యం : ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయడంతో శనివారం రెండు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఇషాక్ తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెలిగల్లు పంచాయతీ కాయలపల్లెకు చెందిన పి రెడ్డెప్ప శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెలిగల్లుకు చెందిన అడపా రామాంజులు, అడపా శివయ్య, అడపా భాస్కర దాడి చేయడంతో గాయపడినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే వెలిగల్లుకు చెందిన అడపా శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాయలపల్లెకు చెందిన రెడ్డెప్ప, అంజి, బాలాజీ, నరసింహులు, శ్రీకాంత్, రామాంజనేయుడులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### మైనారిటీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న దాదా గాంధీ

మదనపల్లె : మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీసీసీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు సాహిల్ దాదా గాంధీ పేర్కొన్నారు. పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మదనపల్లె నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సదస్సు జరిగింది. సదస్సుకు దాదా గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాగాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఎంతో ఘనమైందన్నారు. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత వారి విధానాలతో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో పాలన కొనసాగిస్తూ విభజించు, పాలించు అనే విధానంతో బీజేపీ ప్రభుత్వం ముందుకెళుతోందని విమర్శించారు. మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, డాక్టర్ ఎస్.కే.బాషా,కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు షేక్ అల్లా బక్షు,ఉపాధ్యక్షులు మీనా కుమారి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్,అరిఫుల్లా, రాజంపేట సయ్యద్, నిమ్మనపల్లి మండల అధ్యక్షులు పఠాన్ ముబారక్ ఖాన్, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

# ఝరికోనపై మారుమ్రోగిన హరినామ స్మరణ



ఝరికోనలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఝరికి తరలివస్తున్న గ్రామదేవతలు

కలకడ : హరినామ స్మరణతో పవిత్ర ఝరి కోన మారుమ్రోగిపోయింది. మహాశివరాత్రి మరుసటి రోజు అయిన శనివారం ఉదయం కలకడ నుంచి శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆనాడు సత్యవతికి ఇచ్చిన మాటప్రకారం ఆమెకు దర్శనభాగ్యం కల్పించడానికి వెళ్లగా అక్కడే సత్యవతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తుల కొర్కెలు తీర్చి వరాలు ఇస్తారని ప్రగాఢ నమ్మకం. దీంతో ఉదయం 5గంటల నుంచి భక్తులు స్వామివారివద్ద వరపడ్డారు. ఈమేరకు కలకడ మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడమే కాక చిత్తూరు, కడప, అనంతపురం, జిల్లాల నుంచి తరలివచ్చారు. కర్ణాటక, చెన్నై నుంచి కూడా భక్తులు రావడం విశేషం. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు శివశివ, శంభోశంకర, హరహరమహాదేవ నామస్మరణ చేశారు. పవిత్ర ఝరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు పోటీపడ్డారు. దేవుని మాణ్యాలు, దేవరెద్దులు ఝరిలోకి దిగే సమయంలో అనేక మంది భక్తులు మొక్కుకుంటూ, కోళాటం, చెక్క భజనలు, పిల్లనగ్రోవి, మేళ తాలాలతో నడిపించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు కల్పించి పోలీసులు భద్రత కల్పించారు. ఆరోగ్య, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు క్యాంపులు పెట్టి ఉచిత సేవలు అందించారు. రాయచోటి, పీలేరు, మదనపల్లె, కడప, పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్లు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

# కోలాహలంగా నేల మల్లేశ్వరుని తిరునాల



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



నేల మల్లేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

- పెద్ద సంఖ్యలో చాందిని బండ్లు
- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కన్నుల పండుగగా కామేశ్వర కల్యాణం, లింగోద్భవ పూజలు

నిమ్మనపల్లె : మండలంలోని శ్రీ యోగ నేల మల్లేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం పగలు తిరునాల (జాతర) కోలాహలంగా జరిగింది. జాతర సందర్భంగా నేలమల్లేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మొక్కులు చేసుకున్న భక్తులు చాందినీ బండ్లు కట్టుకుని, డప్పు, మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి నేల మల్లేశ్వర స్వామి ఆలయ ప్రదక్షిణలు చేశారు. వేల సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి దర్శనానికై పోటెత్తారు. దీంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ పరిసరాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. జాతరలోని దుకాణాలు కిటకిట లాడాయి. ఈవో మంజుల, ఉత్సవాల ప్రత్యేక అధికారి రవికుమార్, మండల వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ రమణారెడ్డి, ఆలయ తాత్కాలి కమిటీ సభ్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు.శుక్రవారం రాత్రి శ్రీ కామేశ్వర కళ్యాణం ఆలయ పూజారులు శంకర్ శర్మ, లక్ష్మణస్వామి, తదితరులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు భక్తులకు నిరంతరం స్వామివారి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. మదనపల్లె రెండవ డిపో వారు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఎస్ఐ లోకేష్ రెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గంగాధర శంకర రమేష్ నారాయణ రవి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మహా కాలాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ మహాశివునికి అత్యంత వైభవంగా మహా కాలాభిషేకం నిర్వహించారు. శ్రీ జగన్మమంగళ గోముఖదేవి సమేత హరిహర బ్రహ్మాత్మక లింగోద్భవ మహాశివుడికి నాలుగు యామాల పూజలు చేశారు. మహా కాలాభిషేకం సందర్భంగా విభూది, చందనం, పసుపు, కుంకుమ, పాలు, సుగంధ ద్రవ్యాలు దావణం నూనెలతో రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే బెంగళూరు నేహా వారిచే కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు.

### ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

మదనపల్లె సిటీ : శివరాతి పండుగ పురస్కరించుకుని మదనపల్లె ఆర్టీసీ-1 డిపో నుంచి శైవక్షేత్రాలను ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు.దీంతో ఆర్టీసీని ఆదాయం పెరిగినట్లు డిఎంలు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ, అంగళ్లు మల్లయ్యకొండలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం వల్ల ఈపీకె 87.78, ఓఆర్ 163 వచ్చి తెలిపారు. ఆదాయం రూ. 23,13,291 వచ్చినట్లు తెలిపారు. సిబ్బంది కృషితో ఆదాయం పెరిగినట్లు తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయకొండకు ప్రత్యేక బస్సులు నడపడం వల్ల రూ.15,69,978 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

### మల్లయ్యకొండ ఆలయానికి రూ.12.5 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె : మల్లయ్యకొండ శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి చెల్లించిన కానుకలను శనివారం లెక్కించారు. దీంతో ఆలయానికి రూ.12.5 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణలు తెలిపారు. హుండీ ద్వారా రూ.900058, సేవా టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ. 346261 ఆదాయం వచ్చిందన్నారు. మొదటిసారిగా ఇంత ఆదాయం రావడంతో ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఊరేగింపు



త్రిశూల స్నాన ఘట్టం నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జాగారం చేసిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీకాశీవిశ్వేశ్వరసామి ఆలయం నుంచి శివపార్వతులను పట్టణంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం పీలేరు శివారు ప్రాంతం శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో త్రిశూల స్నానం వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. అలాగే మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ శివరామపురంలో వెలసిన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కనుల పండువగా రథోత్సవం



సంఘమేశ్వరుడి రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వరుని రథోత్సవ వేడుకలు శనివారం కనుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల నుంచి ఆలయంలో పలు పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవానికి భక్తులు ఉపవాస దీక్షతో వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వందలాదిగా తరలి వచ్చిన భక్తులు శివనామ స్మరణలతో రథాన్ని లాగారు. దీంతో ఆ ప్రాంతం శివనామ స్మరణలతో మార్మోగింది. ఉత్సవాలను తిలకించేందుకు పీటీఎం, ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల వాసులే గాక సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఉచిత అన్నదానం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వేటోత్సవం, దీపోత్సవం, సోమవారం వసంతోత్సవం, మంగళవారం మేలుకొలువు, స్వామి వారి విశ్వరూప దర్శన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, పీ.శ్రీనాథ్‌రెడ్డి, రామిరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లపల్లి నరసింహారెడ్డి రథోత్సవానికి హాజరు కాగా వేద పండితులు,ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. చల్లపల్లి స్వామి వారి ఉత్సవ మూర్తుల పల్లకీ సేవలో పాల్గొన్నారు.

# శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామికి పూజలు



భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

కలికిరి : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలో శనివారం వైభవంగా ఝరి ఉత్సవం నిర్వహించారు. గుట్టపాళెం గ్రామం పూలకొండ వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో భ్రమరాబింక, మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మేడికుర్తి బాహుదానది ఒడ్డున వెలసిన అగస్తీశ్వరాలయంలో ఘనంగా ఝరి ఉత్సవం నిర్వహించారు. అగస్తీశ్వ స్వామి గ్రామోత్సవం, గంగిరెద్దుకు ప్రత్యేక పూజలు చేశారు. సోమేశ్వరాలయంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అంగరంగ వైభవంగా పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు.

# వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



వాల్మీకిపురం : విశేష అలంకరణలో లక్ష్మీకామేశ్వర స్వామి

వాల్మీకిపురం : మండలంలో మహాశివరాత్రి పండుగ వైభవంగా జరుపుకున్నారు. స్థానిక కోనేటివీధిలో ఉన్న శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం అభిషేకం, అర్చన, హోమాలు చేశారు. అలాగే నిమ్మనపల్లె రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి ఆలయం, వీరన్న కొండపై ఉన్న వీరభద్ర స్వామి ఆలయం, పాతమంచూరు ఆంజనేయ స్వామి ఆలయం, పడమర పొలిమేర ధర్మపథంలో ఉన్న శ్రీ లింగోద్భవ మహాశివుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని చింతపర్తిలో శ్రీ ఓబులేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్ని ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**పులకించిన ఝరి ఉత్సవం**

పీలేరు రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో బాగంగా మండలంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఝరి ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రంతా శివనామస్మరణతో జాగారం చేసిన భక్తులు శనివారం ఉదయం ఝరి స్నానంతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలలో పలువురు అన్నదాన సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించి స్వామి దర్శనానికి వచ్చిన వారందరికీ ఉచితంతగా భోజన సౌకర్యం కల్పించారు. ఝరిఉత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

**ఝరి ఉత్సవానికి తరలిన దేవరెద్దులు**

కేవీపల్లె : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కలకడ, కేవీపల్లె మండలాల సరిహద్దులోని ఝరికోన ఉత్సవానికి శనివారం మండలం నుంచి అధిక సంఖ్యలో నాణ్యాలు, దేవేరెద్దులతో భక్తులు తరలివెళ్లారు. కేవీపల్లె మండలంలోని వంకవడ్డిపల్లె, తోటిహరిజనవాడ, చిన్నకమ్మపల్లె, గుట్టలపై గ్రామం, మార్రేళ్ల, నారమాకులవడ్డిపల్లె, తువ్వపల్లె, గువ్వలగుడ్డెం, గాలివారిపల్లె తదితర ప్రాంతాల నుంచి దేవరెద్దులు, నాణ్యాలు పెద్ద ఎత్తున తీసుకువెళ్లారు. భక్తి శ్రద్ధలతో, మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్స్, కొలాటం, చెక్కభజనలు, పిల్లనగ్రోవిలతో నాణ్యాలు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఝరిస్నానమాచరించి మొక్కులు చెల్లించారు. అలాగే శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో శ్రీ మల్లికార్జునస్వామి, వగళ్లలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**నేలమల్లేశ్వర స్వామి సేవలో నిసార్ అహ్మద్**

నిమ్మనపల్లె : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా, మండలంలోని తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన తిరుణాల ఉత్సవాలకు మదనపల్లె నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ హాజరయ్యారు. మండల కన్వీనర్ కే సదాశివరెడ్డి నాయకులు రమణారెడ్డి, దిలీప్ రెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులతో కలిసి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



కేవీపల్లె : ఝరి ఉత్సవానికి తరలివెళుతున్న దేవరెద్దు

**శివాలయాల్లో రుద్రాభిషేకాలు**

మదనపల్లె సిటీ : మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయాల్లో శివుడికి రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మదనపల్లె పట్టణం దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఫణికుమార్‌వర్మ రుద్రాభిషేకం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆంజినేయులు, కౌన్సిలర్ సుగుణలు భక్తులకు అన్నదాన సంతర్పణ చేశారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేశారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

# అభివృద్ధిని చూసి జగనన్నను ఆశీర్వదించండి



ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పంచాయతీరాజ్ జిల్లా అభివృద్ధి సలహా మండలి సభ్యులు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం పీలేరు పట్టణంలోని పెద్దమసీదు వీధి, జెండామాను ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి మరోసారి గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోరాదని తెలిపారు. జగనన్న ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎన్.వి. చలపతి, పెద్దోడు, ఎంపీటీసీ ఇబ్రహీం, వార్డుమెంబర్లు అబీద్, రమణ, నాయకులు మునీర్, రహంతుల్లా, మహబూబ్‌బాషా, కదిరి రఫీ, షఫీ, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలి



పీలేరులో కేంద్ర బలగాలు, పోలీస్ అధికారుల కవాతు

పీలేరు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని రాయచోటి డీఎస్పీ ఎస్. మహబూబ్‌బాషా అన్నారు. శనివారం పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలో కేంద్ర సాయుధ బలకాలు, పోలీస్ సిబ్బందిచే కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహుడు పాల్గొన్నారు.

## సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

గుర్రంకొండ : మండలంలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని ఎస్ఐ నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి డీఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని 15 గ్రామాల పరిధిలో శనివారం నుంచి పోలీస్‌యాక్టు అమలులో ఉందన్నారు. ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నా ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వాహనాలకు మైకొసెట్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలీస్‌యాక్టు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా కోతల తిరునాల



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్

మదనపల్లె సిటీ : స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో శనివారం క్రైస్తవులు కోతల తిరుణాల ఘనంగా నిర్వహించారు. పండించిన పంటలను మిషన్‌కాంపౌండ్ మైదానంలో వేలం పాట నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిస్సార్‌అహ్మద్ హాజరయ్యారు. మొదట క్రైస్తవులకు అండగా ఉంటాన్నారు. కోతల తిరుణాల జరుపుకోవడం సంతోషకరమన్నారు. అందరూ కలిసి తిరుణాల జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, జీ.రఫీ, జెసిఎం చర్చి డివిజన్ సంఘ కాపరి డాక్టర్ సునీల్‌వరకుమార్, కార్యదర్శి భక్తవత్సలం, సూరి,మధు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కురబలకోట : మండలంలోని దొమ్మన్నబావి వద్ద శనివారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మదనపల్లె రూరల్ మండలం చీకలబైలుకు చెందిన సందీప్‌ను అరెస్టు చేసి చేశారు. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ముదివేడు ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి కథనం మేరకు..మదనపల్లె రూరల్ మండలం చీకలబైలుకు చెందిన సందీప్ కర్ణాటక నుండి టెట్రా మద్యం ప్యాకెట్లు తెచ్చి మండలంలోని దొమ్మన్నబావి వద్ద చలపతి హోటల్ వెనుక విక్రయించేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. చీకలబైలు సందీప్ పట్టుబడ్డారు. అతని వద్ద నుండి 170 కర్ణాటక మద్యం 90 ఎంఎల్ డబుల్ కిక్ విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమాని చలపతి పరారైనట్లు తెలిపారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు

మదనపల్లె : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, వైద్యం చేయించుకునేందుకు ఆర్థికస్తోమత లేని పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. శనివారం సొసైటీకాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించే దిశగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి, వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటుగా పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని నియమించి, అధునాతన వైద్యపరికరాలు, యంత్రాలను సమకూర్చారన్నారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవల పరిమితిని రూ.5లక్షల నుంచి 25లక్షలకు పెంచి, ప్రాణాంతక వ్యాధులకు సైతం ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందేలా చేశారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న వారిలో వలసపల్లెకు చెందిన టి.ఉదయ్‌నాగరాజ రూ.25వేలు, సీటీఎంకు చెందిన వి.సదాశివ రూ.70వేలు, ప్రశాంత్‌నగర్‌కు చెందిన కలికిరి సుమిత్ర రూ.14వేలు, రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన ఎస్.ఎం.ఫర్హత్‌జాన్ రూ.2లక్షల40వేలు, బసినికొండకు చెందిన ఎం.యర్రమరెడ్డి రూ.55వేలు, గాండ్లపల్లెకు చెందిన మందపల్లెభాస్కర రూ.1లక్ష, కోటవారిపల్లెకు చెందిన మల్లెల భారతి రూ.24వేలు...మొత్తం రూ.5,28,000కు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, వెంకటరమణ, బావాజాన్, కోటవారిపల్లె నారాయణస్వామి, బాలగంగాధరరెడ్డి, ఎల్ఐసీ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.